# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ కర్నూలు జిల్లాలోని గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యుబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ను పార్లమెంటరీ కన్సల్టెటివ్ కమిటీ ఈరోజు పరిశీలించింది.
- ❖ అన్నదాత సుఖీభవ పథకం రెండవ విడత నిధులు ఈ నెల 19న రైతుల ఖాతాల్లోకి జమకానున్నాయి.
- ❖ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరుపతి జిల్లాలో ఈనెల 20, 21 తేదీలలో పర్యటించనున్నారు.
- ❖ దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలలో కొన్ని చోట్ల రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

కర్నూలు జిల్లాలోని పిన్నాపురం వద్ద ఉన్న గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యుబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ను కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలోని పార్లమెంటరీ కన్సల్టెటివ్ కమిటీ ఈరోజు పరిశీలించింది. ముందుగా కర్నూలు చేరుకున్న పార్లమెంటరీ కమిటీ ప్రత్యేక హెలికాప్టర్ లో గ్రీన్ కో ప్రాజెక్టుని విహంగ వీక్షణం ద్వారా పరిశీలించింది. తరువాత గ్రీన్ కో కంపెనీ అధికారులతో సమావేశం నిర్వహించింది. అనంతరం మనోహర్ లాల్ ఖట్టర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ ద్వారా 24 గంటలు పాటూ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు. సోలార్, విండ్ పవర్ కూడా ఉత్పత్తి చేస్తున్నారని కేంద్రమంత్రి తెలియజేస్తూ..

(వాయిస్ 36 సెకన్లు)

====================

అన్నదాత సుఖీభవ పథకం రెండవ విడత నిధులను ఈ నెల 19న జమ చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని ఆయన క్యాంప్ కార్యాలయం నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో ఈరోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు అదేరోజు విడుదల చేయనున్న

నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా కలిపి మొత్తం 7 వేల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి చేరాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 19న వైయస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI)లో క్రియాశీలకంగా లేని ఖాతాలను యాక్టివేట్ చేయాలని, క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని వాటిని సరిచేయాలని సూచించారు. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు మ్యూటేషన్ చేసి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

====================

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈనెల 20, 21వ తేదీలలో తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. పర్యటన నిమిత్తం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి రాష్ట్రపతి రానుండటంతో విమాశ్రయాన్ని స్థానిక ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈనెల 20న తిరుచానూరు పద్మావతి అమ్మవారిని, ఆ మరుసటి రోజు తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని రాష్ట్రపతి దర్శించుకుంటారని చెప్పారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులందరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

====================

సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. యాత్రికులతో వెళ్తున్న బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీ కొనడంతో మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి. ప్రమాద సమయంలో యాత్రికులు నిద్రలో ఉండటంతో 42 మంది సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పవిత్ర ఉమ్రా యాత్రలో భాగంగా.. సౌది అరేబియాలోని మక్కా నగరం నుండి యాత్రికులతో బయలుదేరిన బస్సు మదీనా నగరానికి 30 కిలో మీటర్ల  దూరంలోని అల్ ముఫ్రిహాత్ ప్రాంతంలో డీజల్ ట్యాంకర్ ను ఢీకొని ప్రమాదానికి గురవడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద దుర్ఘటనలో హైదరాబాద్ తో పాటు, తెలంగాణ జిల్లాలకు చెందిన యాత్రికులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వారికి సంతాపం తెలిపారు.

విరామం

====================

మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్.పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. డ్రగ్స్ నియంత్రణ కోసం ఇప్పటికే ప్రతి కళాశాలలోనూ ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేశామని, ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నారని తెలిసినట్లయితే డీ ఎడిక్షన్ సెంటర్స్ ద్వారా చికిత్స అందిస్తున్నామని ఎస్.పి తెలిపారు. గుంటూరు నగర పరిధిలో ఈ రోజు 17 గ్రాముల ఎం.డి.ఎం.ఏ డ్రగ్స్ ను స్వాధీనం చేసుకున్నామని పాత్రికేయులకు తెలిపారు. ఈ కేసులో ఆరుగురు ముద్దాయిలను పట్టుకున్నామని, వారు బెంగుళూరు నుండి డ్రగ్స్ తీసుకువచ్చి గుంటూరులో అమ్ముతున్నారని ఎస్.పి. వివరిస్తూ..

(వాయిస్ 28 సెకన్లు)

====================

రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కమిషన్ నూతన చైర్మన్ గా సోళ్ల బొజ్జి రెడ్డి ఈరోజు భాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నూతన చైర్మన్ గా నియమితులైన ఆయన విజయవాడ బందరు రోడ్డులోని ఎస్టీ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో భాధ్యతలు చేపట్టగా కమిషన్ సభ్యులుగా జి. సునీత, కె. లక్ష్మి, కె. మల్లేశ్వరరావు, కె. సాయిరాము, పి. వెంకటప్పలు బాధ్యతలు

స్వీకరించారు. అనంతరం ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి మాట్లాడుతూ... ఆదివాసీ ప్రాంతాలలో సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలలో రహదారులు, తాగు నీరు వంటి మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ ఆదివాసి కుటుంబానికి చేరేలా తన వంతు కృషి చేస్తానని సోళ్ల బొజ్జి రెడ్డి తెలియజేశారు.

====================

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ను అందించే క్రమంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ను అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణతో కలిసి పర్యటించిన ఆయన నగరంలోని ద్వారకానగర్ లో 4 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కే.వి. విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు నిరంతరాయమైన, నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

====================

నైరుతి బంగాళాఖాతానికి ఆనుకొని ఉన్న శ్రీలంక తీర ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఇది రాగల 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతోందని, దీని ఫలితంగా రేపటి వర్ష సూచనలను వాతావరణ శాఖాధికారి ఎం. వెంకట్రావ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 19 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84 వేల 562 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరకు 388 పాయింట్లు లాభపడి 84 వేల 950 వద్ద స్థిరపడింది.

====================
====================